క్లుప్తంగా

కేటీఆర్‌కు ఘన స్వాగతం



జడ్చర్ల: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం గద్వాల పర్యటకు వెళ్తున్న సందర్భంగా జడ్చర్ల వద్ద పార్టీశ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇటీవల సాక్షి దిన పత్రికలో నాడు బీళ్లు.. నేడు సిరులు శీర్షికన వచ్చిన కథనం ఉన్న పత్రిక ప్రతిని బీఆర్‌ఎస్ నాయకులు కేటీఆర్ చేతికి అందించారు. నాడు బీఆర్‌ఎస్ తీసుకున్న విధానపరమైన నిర్ణయాల ఫలితంగానే నేడు పాలమూరు పంటల పచ్చదనంతో కళకళలాడుతుందని కేటీఆర్‌కు వివరించారు. పార్టీశ్రేణులకు అభివాదం చేస్తూ కేటీఆర్ ముందుకు కదిలారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్, నాయకులు శంకర్‌నాయక్, ఇమ్ము, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి మొదటి విడత సామాజిక తనిఖీ

గండేడ్: ఉపాధి హామీ పనులకు సంబంధించి నేటినుంచి మొదటి విడతగా ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఏపీఓ హరిశ్చంద్రుడు తెలిపారు. ఉమ్మడి గండేడ్ మండలంలో 49 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో 15 గ్రామ పంచాయతీల్లో మొదటగా సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గండేడ్ మండలంలోని జంగంరెడ్డిపల్లి, చిన్నవార్వాల్, కొంరెడ్డిపల్లి, అంచన్‌పల్లి, కొండాపూర్, వెన్నాచేడ్, రుసుంపల్లి, సల్కర్‌పేట్, గండేడ్‌లో సామాజిక తనిఖీ కొనసాగుతుందని తెలిపారు. మహమ్మదాబాద్ మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లి, గాధిర్యాల్, దేశాయిపల్లి, చిన్నాయపల్లి, నంచర్ల, అన్నారెడ్డిపల్లిలో కూడా సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

'కల్తీకల్లు సరఫరా మా దృష్టికి రాలేదు'

జడ్చర్ల: జడ్చర్లకు హైదరాబాద్ నుంచి కల్తీకల్లు సరఫరా అవుతున్నట్లు ఎక్కడా తమ దృష్టికి రాలేదని ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఈగల్ టీం దాడులు చేసి కల్తీ కల్లు తయారీకి సంబంధించి ఆల్ప్రాజలం స్వాధీనం చేసుకోవడం, జడ్చర్లకు కల్తీ కల్లు సరఫరా చేస్తున్నట్లు శనివారం మీడియాలో వచ్చిన వార్తా కథనాలపై విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు తమకు ఆయా దాఖలాలు కనపించలేదన్నారు.

గిరిజన హాస్టళ్ల సిబ్బంది వేతనాలు పెంచాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గిరిజన ఆశ్రమ హాస్టళ్లలో విధులు నిర్వహిస్తున్న కాంటింజెంట్ కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు సిబ్బందికి వేతనాలు పెంచాలని రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న నిరసనలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎస్టీ హాస్టల్ వద్ద నిర్వహిస్తున్న నిరసనకు సీఐటీయూ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్నిరోజులుగా న్యాయమైన డిమాండ్లతో సమ్మె చేస్తున్నారని, వెంటనే ప్రభుత్వం వారి డిమాండ్లను నెరవేర్చాలని పేర్కొన్నారు. ఇస్తున్న వేతనాల్లో కోత విధించడం, సమాన పనికి సమాన వేతనంలో భాగంగా కనీసం రూ.26వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. అందరితోపాటు సాధారణ సెలువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, జ్యోతి, రుక్మిణి, స్వరూప, అనిత, భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవమ్మ సేవలు చిరస్మరణీయం



మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు కామ్రేడ్ ఎస్ఎస్ లక్ష్మీదేవమ్మ సేవలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ లక్ష్మీదేవమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘంలో పనిచేస్తూ మహిళా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. కుటుంబ కలహాలు వచ్చినప్పుడు ఇద్దరిని కూర్చోబెట్టి కుటుంబాలకు భరోసాగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామ్‌రెడ్డి, కిల్లెగోపాల్, కురుమూర్తి, చంద్రకాంత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లాల్‌కోట.. సమస్యల పుట్ట



లాల్‌కోట జీపీ వెనుక భాగంలో ఏర్పడ్డ మురుగు గుంత

- రాజ్యమేలుతున్న అపరిశుభ్రత
- ఇళ్ల మధ్యనే గుంతలు, ముళ్లపొదలు
- అంతర్గత రోడ్లపై పారుతున్న మురుగు
- గ్రామస్తుల ఇక్కట్లు.. పట్టని అధికారులు

చిన్నచింతకుంట: మండలంలోని లాల్‌కోటలో సమస్యలు తిష్టవేశాయి. కొన్నేళ్లుగా పారిశుద్ధ్యం లోపించి అపరిశుభ్రం రాజ్యమేలుతున్నది. ఇళ్ల మధ్యనే ప్రమాదభరిత గుంతలు ఏర్పడి మురుగుకు ఆవాసంగా మారింది. వాటిచుట్టూ ముళ్లపొదలు మొలిచి విషసర్పాలు సంచరిస్తున్నాయి. పలుచోట్ల పాతబడ్డ ఇల్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు లేక మురుగు రోడ్లపై పారుతూ.. పందులు సంచరిస్తూ దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు వ్యాపించి ప్రజలు రోగాల భారిన పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛభారత్ పనులు అధికారులు నిర్లక్ష్యానికి నీరుగారుస్తున్నారు. పారిశుద్ధ్యం లోపించి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం

అధికారుల పర్యవేక్షణ లోపంతోనే గ్రామంలో పారిశుద్ధ్యం లోపించింది. 2,958 జనాభ, 2,274 ఓటర్లు, 10 వార్డులు ఉన్నాయి. నాటినుంచి విద్య, రాజకీయ, ఆధ్యాత్మిక రంగాల్లో ముందు వరుసలో ఉన్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనకబడి ఉంది. గ్రామంలో నేటికి సరైన సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించిన పాపానపోలేదు. ముఖ్యంగా జీపీ కార్యాలయం, ఆంజనేయ స్వామి ఆలయం వెనక భాగా ల్లో ప్రమాదభరితంగా మురుగు గుంతలు ఏర్పడి కుంటలుగా మారాయి. వాటర్ ట్యాంక్ సమీపం, పాత పీహెచ్‌సీ వద్ద పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు మొలిచి పందులు, పాములకు నిలయంగా మారా యి. ఇళ్ల మధ్యలో ఏర్పడిన మురుగు గుంతల్లో చిన్నారులు పడి ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని కోరుతున్నారు.

సబ్‌ప్లాన్ పనులకు మోక్షం కరువు

లాల్‌కోటలో ఎస్సీ సబ్‌ప్లాన్ పనులకు నోచుకోలేదు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనప్పటికీ నేటికీ అధికారులు పనులు చేపట్టక పోవడంపై కాలనీవాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణానికి గతేడాది రూ.9.50లక్షలు మంజూరయ్యాయి. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులకు మోక్షం కలగడం లేదు. పనులు చేపట్టేందుకు జీపీ నుంచి తీర్మానం చేసినా పనుల్లో జాప్యం ఎందుకు వహిస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు.



డ్రెయినేజీ లేక రోడ్డుపై పారుతున్న మురుగు

సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి



గ్రామంలోని ఎస్సీకాలనీలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి. రోడ్డుపై మురుగు పారి వర్షాకాలంలో రోడ్డంతా బురదమయంగా మారుతుంది. కాలనీలోని వృద్ధులు, చిన్నారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఎస్సీకాలనీలో సమస్యలపై దృష్టిసారించాలి.
– తిరుపతయ్య, లాల్‌కోట

లోపించిన పారిశుద్ధ్యం



పారిశుద్ధ్యం లోపించి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు గుంతలు, చిత్తడి రోడ్లు, పాతబడ్డ ఇళ్లు, ముళ్లపొదలు ప్రమాద భరితంగా మారాయి. వాటినుంచి దుర్వాసన వెదజల్లి రోగాలభారిన పడుతున్నారు. పాముల సంచారంతో భయపడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.
– కావలి ఆంజనేయులు, లాల్‌కోట

గుంతలు పూడ్చేందుకు నిధుల్లేవ్



గ్రామంలో ఏర్పడిన మురుగు గుంతలు పూడ్చేందుకు జీపీలో సరైన నిధులు లేవు. జీపీ వెనుక, ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో పాడుబడ్డ బావులు మురుగు బొందలుగా మారాయి. వాటిని పూడ్చేందుకు పెద్ద ఎత్తున మట్టి కావాలి. ప్రభుత్వం నుంచి నిధులొస్తే బొందులు పూడ్చే అవకాశం ఉంటుంది.
– అనిల్‌కుమార్, ఎంపీఓ చిన్నచింతకుంట

పనులు చేపడుతున్నాం

రోజువారీగా పారిశుద్ధ్యం పనులు చేపడుతున్నాం. కార్మికుల చేత ఎప్పటికప్పుడు డ్రెయినేజీల్లో మురుగు తొలగిస్తూ ఎక్కడా పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపడుతున్నాం. ఎస్సీ వాడలో సబ్‌ప్లాన్ పనులు చేపట్టేందుకు జీపీ నుంచి తీర్మానం కూడ ఇచ్చాం. కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ముందుకు రావడంలేదు.
– రాజు, పంచాయతీ కార్యదర్శి, లాల్‌కోట

నిరీక్షించి.. నీరసించి



నవాబుపేట రైతువేదిక వద్ద యూరియా కోసం గుమిగూడిన రైతులు

- యూరియా కోసం గంటల తరబడి నిరీక్షణ
- వందలకొద్దీ బారులుదీరిన రైతులు

నవాబుపేట: యూరియా కోసం రైతులు నిరీక్షించి నీరిశించి పోతున్నారు. క్యూలైన్లు వరుసగా కొనసాగుతూనే ఉన్నాయి. యూరియా వచ్చిందని తెలియగానే వేల సంఖ్యలో తరలివచ్చి క్యూ కడుతున్నారు. శనివారం మండల కేంద్రంలో యూరియా రావడంతో రైతువేదికల చెంత రైతన్న బారులుదీరారు. కాగా వచ్చిన రైతులలో చాలామంది మహిళా రైతు లే ఉండటం ప్రత్యేకం. కాగా శనివారం నవాబుపేట సహకార సంఘానికి 6వందల బస్తాలు, కొల్లూర్ ఆగ్రో కేంద్రానికి 275 బస్తాల యూరియా వచ్చింద ని రైతులు ఎక్కువగా రావడంతో ఒక్కొక్కరికి ఒక్క బస్తానే పంపిణీ చేసినట్లు అధికారులు వివరించారు.

'బస్తా యూరియాకు కన్నమ్మ తిప్పలు'

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఒక్క యూరియా బస్తా కోసం రైతులు కన్నమ్మ తిప్పలు పడుతున్నారని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణముదిరాజ్, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు శివన్న శనివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యత ఉన్న రైతుల కష్టాలు తీర్చేందుకు యూరియాపై సమీక్షించేది పోయి సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పుడో 2027లో జరిగే పుష్కరాల మీద సమీక్షలు నిర్వహించడం అత్యంత హేయమైన చర్య అని దుయ్యబట్టారు. సీఎం సొంత జిల్లాలో యూరియా కోసం రైతులు రాత్రింభవళ్లు క్యూలైన్లలో ఉన్న పరిస్థితి చూస్తే సీఎం సిగ్గుతో తలదించుకోవాలని విమర్శించారు. రైతులు పడుతున్న ఇబ్బందులపై మంత్రులు నోటికి వచ్చినట్లు రైతులను హేళనచేస్తూ మాట్లాడడం సిగ్గు చేటని ఆరోపించారు. రైతులకు పార్టీలను అంటకట్టి యూరియా సమస్యే లేదనట్లు సీఎం, మంత్రులు ప్రవర్తిస్తున్నారని, ఇప్పటికై నా సీఎం సోయి తెచ్చుకుని యూరియా కష్టాలపై సమీక్షించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల ఆగ్రహానికి రేవంత్ ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు.



నవాబుపేట రైతువేదికకు భారీగా తరలివచ్చిన మహిళా రైతులు

బాలికల విద్య సమాజానికి అవసరం



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నేటి సమాజంలో బాలికల విద్య ఎంతో అవసరమని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో బాలికల హాస్టల్ (సి)లో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక కుటుంబంలో బాలికలు చదువుకుంటే ఆ కుటుంబం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుకోవాలన్న ఉద్దేశంతో హాస్టల్‌లో ఉంచి ఉన్నత చదువులు చదివిచడం హర్షించదగ్గ విషయం అన్నారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలంటే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, వసతులను వినియోగించుకుని జీవిత లక్ష్యాన్ని చేరుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో షీ టీం సీఐ శ్రీనివాసులు, ఏఎస్‌డీఓ సుదర్శన్, వసతిగృహ సంక్షేమాధికారిణి స్వప్నప్రియ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కేసు

జడ్చర్ల: కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి తప్పు డు భూ రిజిస్ట్రేషన్‌చేసిన వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని ఈర్లపల్లికి చెందిన తిరుపతయ్య, లింగమ్మ, లక్ష్మమ్మ 6.11 ఎకరాల తమ పట్టా భూమిని హైదరాబాద్‌కు చెందిన రాఘవేందర్‌రెడ్డికి విక్రయించేందుకు 31 అక్టోబర్ 2015 అగ్రిమెంట్ చేసుకున్నారు. సకాలంలో భూమిని రిజిస్ట్రేషన్ చేయక పోవడంతో 4వ అదనపు జడ్జి మహబూబ్‌నగర్‌లో బాధితుడు దా వా వేశారు. విచారించిన కోర్టు బాధితుడికి భూమి ని రిజిస్ట్రేషన్ చేయాలంటూ తీర్పును ప్రకటించినా కోర్టు తీర్పును ఖాతరు చేయకుండా భూమిని బాలానగర్‌కు చెందిన తిరుపతయ్య పేరున రిజిస్ట్రేషన్ చేశారు. కోర్టు ఉత్తర్వులను దాచిపెట్టి మోసపూరితంగా భూ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన తిరుపత య్య, లింగమ్మ, లక్ష్మమ్మతోపాటు కొనుగోలుదారు తిరుపతయ్య, సాక్షులుగా సహకరించిన చెన్నకేశవులు, శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాలికల హాస్టల్‌లో వైద్యశిబిరం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల హాసల్‌లో కేవీపీఎస్ సంఘం ఆధ్వర్యంలో స్మైలీ ఆండ్ షైనీ డెంటల్ ఆస్పత్రి సౌజన్యంతో విద్యార్థులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏఎస్‌డబ్ల్యూఓ సుదర్శన్ ప్రారంభించి మాట్లాడారు. వర్షాల సీజన్ కావడంతో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, వైద్యం కోసం డబ్బులు ఖర్చు చేసుకునే పరిస్థితి ఉందని, ఇలాంటి క్రమంలో డాక్టర్లు ఇక్కడికి వచ్చి వైద్యం చేసి మందులు కూడా ఇవ్వడం గొప్ప విషయమని డాక్టర్‌లను అభినందించారు. కార్యక్రమంలో వార్డెన్ మధులత, డాక్టర్‌లు దిగ్విజయ్, సమత, అంజని, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్యంరాజు, కురుమయ్య పాల్గొన్నారు.

విలీన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రభుత్వం తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వ హించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల్‌నర్సింహ అన్నారు. శనివారం సురవరం వెంకట్రామిరెడ్డి భవన్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిజాం సంస్థానం భారత్‌లో విలీనం కావాలని 1947 సెప్టెంబర్ 11న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ హిందూ ముస్లిం పోరాటంగా చెబుతున్నార ని మండిపడ్డారు. ప్రజలను అనేక చిత్రహింసలకు గురిచేసిన ఖాసీం రజ్వీని పాకిస్తాన్ వెళ్లడానికి ఎలా ఒప్పుకున్నారో బీజేపీ నాయకులు సమాధానం చె ప్పాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో నాయకులు పరమేశ్ గౌడ్, రాము, కృష్ణ, నరేందర్‌రెడ్డి, సత్యనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే.. బురదమయం



చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం దాసర్‌పల్లి ప్రాథమిక పాఠశాల నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు ఉన్న రోడ్డు చినుకు పడితే బురదమయంగా మారుతుంది. దీంతో బురదగా మారిన రోడ్డుపై ప్రజలు తిరిగేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు బురదలో జారిపడే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



మిడ్జిల్: నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని మామిళ్లపల్లికి చెందిన పట్టర్లపల్లి శివగౌడ్(35)అతని భార్య అనూషతో మిడ్జిల్ మండలంలోని వాడ్యాల్‌లో బంధువుల ఇంటికి ఈనెల 5వతేదీన వచ్చారు. ఈనెల 12వతేది ఉదయం 1గంటకు శివగౌడ్ కారు సర్వీసింగ్ చేయించుకొని వస్తానని భార్యతో చెప్పి, ఇంటినుంచి కల్వకుర్తి వెళ్లాడు. సాయంత్రం 3గంటల నుంచి శివగౌడ్‌కు కాల్ చేస్తుండగా.. స్విచ్ఛాఫ్ వస్తుందని, బంధువల ఇళ్లు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం మిడ్జిల్ పోలీస్‌స్టేషన్‌లో భార్య అనూష ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు మిడ్జిల్ పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

యువకులపై దాడి

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి శివారులోని రెడ్డిగూడ కమా న్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి అగిఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టింది. రోడ్డు మీద ఎలా టాక్టర్‌ను ఎలా నిలిపారని ట్రాక్టర్ డ్రైవర్‌ను జడ్చర్లలోని ప్రైవేట్ కంపెనీకి డ్యూటీకి వెళ్తున్న వాడ్యాల్‌కు చెందిన మల్లేశ్, శివకుమార్, చౌదర్‌పల్లికి చెందిన శివకుమార్ ముగ్గురు కలిసి ప్రశ్నించారు. మాటామాట పెరగడంతో ట్రాక్టర్ డ్రై వర్ గ్రా మస్తులకు ఫోన్ చేయడంతో గ్రామానికి చెందిన యు వకులు వచ్చి ముగ్గురు యువకులపై మూ కుమ్మడిగా దాడి చేసి పరారయ్యారు. దీంతో యువ కులు మిడ్జిల్ పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా.. గాయపడిన యువకులను ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. యువకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉత్తమ కరస్పాండెంట్‌గా మణెమ్మ

దేవరకద్ర: ట్రస్మా ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లాలో ఉత్తమ కరస్పాండెంట్, ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డులు దేవరకద్రలోని అనూషా కాన్వెంట్ ఉన్నత పాఠశాలకు దక్కాయి. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపాలిటీలోని అనూషా కాన్వెంట్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మణెమ్మకు ఉత్తమ కరస్పాండెంట్‌గా, అదే పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు సరస్వతికి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డులను రాష్ట్ర ట్రస్మా అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, నిర్వాహకులు,వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి సహకారం

జడ్చర్ల టౌన్: జర్నలిస్టుల సంక్షేమం కోసం పూర్తి స హకారం అందిస్తామని జడ్చర్ల సీఐ కమలాకర్ అ న్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని సత్కరించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో నిరంతరం నిమగ్నమై ఉండే వృత్తిలో ప్రధానమైనది జర్నలిజమన్నారు. అనంతరం భాగంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి సుల్తాన్, కోశాధికారి ప్రభాకర్, సంయుక్త కార్యదర్శి మల్లేశ్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, సంతోషి కిరణ్మయిని శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐలు జయప్రసాద్, మల్లేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేద్దాం



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

జడ్చర్ల టౌన్: ప్రజారోగ్యం లక్ష్యంగా పనిచేద్దామని కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వానపల్లి ప్రశాంత్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం జడ్చర్ల కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మందుల కోసం వచ్చిన వారిని చిరునవ్వుతో పలకరించి వారి సందేహాలు నివృత్తి చేస్తే అది ఎంతో తృప్తినిస్తుందన్నారు. కొన్ని చిన్నచిన్న మార్పులు చేసుకోవడంతో అసోసియేషన్‌లో ఐక్యత పెరుగుతుందన్నారు. ఒక కెమిస్ట్ ఇచ్చిన మందులను మరో కెమిస్ట్ తప్పుపట్టకూడదని, అలా చేయటంతో ఐక్యత దెబ్బతినడంతోపాటు అభిప్రాయబేదాలు ఏర్పడతాయన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో మనందరం కృషిచేద్దామన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై నందుకు జడ్చర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆయనతోపాటు ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, కోశాధికారి రాఘవేందర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రవిశంకర్, శేఖర్, కిరణ్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సదర్భంగా జడ్చర్ల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని శాలువా, పూలమాలతో సత్కరించారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పనిసరి



మాట్లాడుతున్న వార్డెన్ శివకుమార్



మాట్లాడుతున్న నంచర్ల వార్డెన్ అశోక్

మహమ్మదాబాద్: చదువులో విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పకుండా ఉండాలని నంచర్ల ఎస్సీహాస్టల్ వార్డెన్ అశోక్ తెలిపారు. శనివారం హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో ఉపాధ్యాయుల బోధన ఒక ఎత్తయితే.. వారు సమయానుసారంగా చదువుకోవడం మరో ఎత్తని తెలిపారు. అందుకు తల్లిదండ్రులు కూడా అప్పుడప్పుడు వారి చదువు, క్రమశిక్షణను పరిశీలించాలని సూచించారు. వసతిగృహంలో ప్రభుత్వం కల్పించిన ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తున్నామని తెలిపారు. ఇక విద్యార్థులు కూడా క్రీడలతోపాటు మంచి విద్యను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదిరులు ఉన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్‌లో..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస్‌కాలనీ వద్ద ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌లో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డెన్ శివకుమార్ హాస్టల్‌లో విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని, బాగా చదివి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకోని రావాలని కోరారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలకు వెళ్లేందుకు చాలాదూరంగా ఉందని, ఒక వాహనం ఏర్పాటు చేయాలని కోరగా.. అధికారులకు సమస్యలను వివరించి పరిష్కరించేందుకు కృషిచేస్తామని వార్డెన్ పేర్కొన్నారు.

పాత మండల పరిషత్ భవనానికి హంగులు



పాత మండల పరిషత్ భవనానికి హంగులు అద్దుతున్న కార్మికులు

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని పాత మండల పరిషత్ కార్యాలయ భవనానికి కొత్త హంగులు దిద్దుతున్నారు. దాదాపు 70ఏళ్ల క్రితం అప్పటి సమితి కోసం నిర్మించిన భవనం సమితులను రద్దు చేసిన తర్వాత ఈ భవనాన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కేటాయించారు. నాలుగు దశాబ్దాలుగా పాఠశాలను ఇక్కడ నిర్వహించిన తర్వాత మరో కొత్త భవనంలోకి పాఠశాలను మార్చారు. మండల వ్యవస్థ ఏర్పడిన తర్వాత భవనాన్ని మండల పరిషత్‌కు కేటాయించారు. రెండు దశాబ్దాలపాటు మండల పరిషత్‌కు ఉపయోగించిన తర్వాత కొత్త భవనం నిర్మాణంతో మండల పరిషత్‌ను ఇక్కడి నుంచి తరలించారు. ఆ తర్వాత కొంతకాలం వ్యవసాయ శాఖకు కేటాయించగా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని రైతువేదికలకు తరలించి ఇటీవల మిషన్ భగీరథకు కేటాయించారు. ప్రస్తుతం ఇదే భవనం కొత్తగా ఏర్పాటు చేసే కోర్టుకు కేటాయించారు. దీంతో దాదాపు రూ.40లక్షలతో పాత మండల పరిషత్ భవనానికి మరమ్మతులు చేపట్టారు. దసరా పండుగకు కోర్టును ప్రారంభించాలని నిర్ణయించడంతో రాయిచూర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ భవనంలో తాత్కాలికంగా కోర్టును ఏర్పాటు చేయడానికి సిద్ధం చేస్తున్నారు.